ప్రజాశక్తి
మంగళవారం 14 ఫిబ్రవరి 2023
5
విజయనగరం

మిల్లుల దోపిడీని నిరోధించాలి

జెసికి ఎపి రైతుసంఘం వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో రైతులవద్ద ధాన్యం కొనుగోలుకు అనుమతులు వచ్చినా అనేక ఆర్‌బిలలో ఇంకా ప్రక్రియ ప్రారంభం కాలేదని, అన్ని కేంద్రాల్లోనూ వెంటనే కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌ను రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో జెసికి వినతి అందజేశారు. మిల్లుకు ధాన్యం తొలి ఆప్‌లోడు చేసి కేజీలు కోతకోసిన ధాన్యానికి డబ్బులు ఇవ్వని రైతులకు ధాన్యం ఎకనాల్జ్ చేయడం లేదన్నారు. నెల రోజులు కితం తీసుకెళ్లిన ధాన్యానికి ఇంతవరకు డబ్బులు జమకానందున చర్యలు తీసుకోవాలని కోరారు. అపరాలు పంట తెగుళ్లు, తేనెమంచు మూలాన 50శాతం దిగుబడులు తగ్గాయని, పంటల బీమా ఇప్పించాలని కోరారు.

ఎన్నాళ్లీ అవస్థలు?

- అవసరం 42ఎంఎల్‌డి..వస్తున్నది 27 ఎంఎల్ డి
- రోజు తప్పించి రోజు తాగునీటి సరఫరా
- రూ.65 లక్షలతో సమ్మర్ ప్లాన్

ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం ఒక మనిషి అవసరాల కోసం రోజుకు 130 లీటర్ల నీరు అవసరం. విజయనగరం జిల్లా కేంద్రంలో 3లక్షలు దాటి జనాభా ఉన్నారు. దీని ప్రకారం 42 ఎంఎల్‌డి నీరు నగర ప్రజలకు అవసరముంది. కానీ నేడు నగర ప్రజలకు సరాసరి రెండు రోజులకు కలిపి 130 లీటర్ల నీరు కూడా అందడం లేదు. రోజుకు నగర పాలక సంస్థకు 27ఎంఎల్‌డి నీరు కూడా సరఫరా కావడమే దీనికి కారణం. పాలకవర్గాలు మారుతున్నా నగర ప్రజలకు తాగునీటి అవస్థలు తప్పడం లేదు. దీంతో నగరానికి వస్తున్న నీటిని ఒక రోజు 25 డివిజన్లకు, మరుచటి రోజు మరో 25 డివిజన్లకు సరఫరా చేస్తున్నారు.

కెఎల్‌పురంలో ట్యాంకర్ వద్ద నీరు పట్టుకుంటున్న స్థానికులు

పైపులైన్‌కు మరమ్మతు చేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో 50 డివిజన్‌లు ఉన్నాయి. గత కొన్నేళ్లుగా ప్రజలకు రోజు తప్పించి రోజు మాత్రమే నీరు సరఫరా చేస్తున్నారు. దీంతో అరకొర నీటితో నగర ప్రజలు సర్దుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరో వైపు రూ.200కే కుళాయిలు సుమారుగా 10వేల మందికి ఇచ్చారు. కుళాయి కనెక్షన్లు ఇచ్చినా నీటి సరఫరా మాత్రం జరగలేదు.

అంతా లీకేజీల మయం

నగరంలో తాగునీటి సరఫరాలో పైపులైన్లలో లీకేజీలు అధికంగా ఉన్నాయి. 30 ఏళ్ల కిందట వేసిన పైపు లైన్లు కావడంతో నగరంలో అనేక ప్రాంతాల్లో లీకేజీలు పెరిగాయి. దీంతో గత రెండు నెలలుగా లీకేజీలు అరికట్టేందుకు రూ.11లక్షలు ఖర్చు చేసి మరమ్మత్తులు చేశారు. ఇటీవల రోడ్ల వెడల్పు కార్యక్రమంలో ఏర్పడిన 16 లీకేజీ పాయింట్లను కార్పొరేషన్ అధికారులు బాగు చేశారు. లీకేజీల అరికట్టేందుకు నూతన పైపు లైన్లు వేస్తే తప్ప శాశ్వత పరిష్కారమయ్యే అవకాశం కనిపించడం లేదు.

విలీన ప్రాంతాలకు అందని తాగునీరు

నగర పాలక సంస్థ లో విలీనమైన గాజులరేగ, జమ్ము నారాయణ పురం, కెఎల్ పురం, ధర్మపురి, అయ్యన్నపేట వంటి ప్రాంతాలు విలీనం జరిగి ఆరేళ్లు దాటుతున్నా నేటికీ పైపు లైన్లు ద్వారా తాగునీరు సరఫరా కావడం లేదు. అమృత పథకం ద్వారా పైపు లైన్లు, రూ.200కే కుళాయి కనెక్షన్లు ఇచ్చారు తప్ప ఆ కుళాయిలు ద్వారా ఇచ్చే నీరు మాత్రం నేటికీ సరఫరా కావడం లేదు. దీంతో ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు. మరోవైపు నగరంలో భాగంగానే ఉన్న తోటపాలెం వైఎస్ఆర్ కాలనీకి నేటికీ కుళాయిల ద్వారా నీటిని సరఫరా చేయకపోవడంతో వారంతా తమ ఇంటి బోరు నీటిపైనే ఆధారపడుతున్నారు.

రూ.65 లక్షలతో సమ్మర్ యాక్షన్ ప్లాన్

మరో వైపు వేసవి సమీపిస్తుండటంతో నగర పాలక సంస్థ అధికారులు నీటి ఎద్దడిని అధిగమించేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు. వాస్తవానికి వేసవి వస్తే నెల్లిమర్ల నీటి పథకాలు నుంచి నీటి సరఫరా తగ్గి పోనుంది. దీంతో నీటి ఎద్దడిని అధిగమించేందుకు రూ.65 లక్షలతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కు శ్రీకారం చుట్టారు. దానిలో రామతీర్థం ప్రోజెక్ట్ నుంచి నీటిని మరలించేందుకు శాండ్ బ్యాగ్స్ కోసం రూ.9.25లక్షలు, గోస్తనీ నదిలో నీరు స్టోరేజ్ కోసం అవసరమైన ఇసుక బ్యాగ్‌ల కోసం రూ.9.99లక్షలు, మధుపాడ నీటి పథకం వద్ద వెల్ సింకర్స్ రిమూవల్ కోసం రూ.8.50లక్షలు, రామతీర్థం ప్రోజెక్ట్ వద్ద వెల్ సింకెర్స్ రిమూవల్ కోసం రూ.6.58లక్షలు, బోర్ వెల్స్ ఫ్లాషింగ్ కోసం రూ.10లక్షలు, 1వ డివిజన్ నుంచి 50వ డివిజన్ వరకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా కోసం రూ.11.10లక్షలు, కేటాయించారు. ఆంధ్ర రిజర్వాయర్ నుంచి నెల్లిమర్ల పంప్ హౌస్‌కు నీటిని మళ్లించేందుకు రూ.9.95లక్షలతో ప్రతిపాదనలు తయారు చేశారు.

చిట్టీల వ్యాపారి టోకరా

ప్రజాశక్తి-సాలూరు

పట్టణంలో ఓ చిట్టీల వ్యాపారి కోట్లాది రూపాయలకు టోకరా వేసి పరారయ్యాడు. దీంతో కూలీ నాలి చేసుకుని కుటుంబ పోషణ ఖర్చులు పోగా మిగిలిన డబ్బును నెలనెలా చిట్టీ కడితే ఆ డబ్బు అవసరాలకు పనికొస్తుందని భావించిన వారంతా లబోదిబోమంటున్నారు. సోమవారం స్థానిక పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు.

పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితులు

నమ్మకంగా ఉంటూ చిట్టీలను నడిపే మండవిల్లి సోమశేఖర్ (39) పట్టణానికి చెందిన అనేకమంది పేద, మధ్యతరగతి ప్రజలను నిలువునా ముంచేశాడు. కూతురు పెళ్లి కోసమనో, పిల్లల చదువు కోసమనో చాలా మంది సోమశేఖర్ దగ్గర చిట్టీలు కట్టారు. పట్టణానికి చెందిన కొంతమంది చిరువ్యాపారులు కూడా ఆయన వద్ద చిట్టీలు కట్టి మోసపోయారు. వీరంతా సోమవారం పట్టణ పోలీస్ స్టేషన్‌కి వచ్చి తమ గోడు వెలిబుచ్చారు. టౌన్ సిఐ సిహెచ్.శ్రీనివాసరావు దృష్టికి తాము మోసపోయిన వైనం గురించి వివరించారు. ఆయనకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

పరారైన చిట్టీల వ్యాపారి సోమశేఖర్ ఐపి పెట్టినట్లు తెలుస్తోంది. దీనికోసం కోర్టులో ఆయన పిటిషన్ వేశారనే ప్రచారం సాగుతోంది. సోమశేఖర్ ఎవరెవరికి బాకీ ఉన్న విషయాన్ని దానిలో పొందుపరిచినట్లు తెలుస్తోంది. ఇదే తరహాలో పట్టణానికి చెందిన మరో వ్యాపారి కూడా కోట్లాది రూపాయలకు టోకరా పెట్టి పరారైనట్లు ప్రచారం సాగుతోంది. దీనిపై ఇంకా బాధితులు పోలీసులను ఆశ్రయించలేదు. అనధికార చిట్టీలు కట్టొద్దని పోలీసులు హెచ్చరిస్తున్నా పేద, మధ్యతరగతి ప్రజలు వాటి నిర్వాహకుల వలలో పడి మోసపోతున్నారు.

విచారణ చేపడతాం

అనధికార చిట్టీల్లో చేరి మోసపోయిన పట్టణ ప్రజల నుంచి ఫిర్యాదు అందింది. విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. అనధికార చిట్టీ వ్యాపారుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నా ప్రజల వైఖరిలో మార్పు లేదు. ఒకవైపు ఇలాంటి సంఘటనలలో మోసపోయిన బాధితుల గురించి మీడియాలో వార్తలు వస్తున్నా ప్రజల్లో చైతన్యం రావడం లేదు.

ఆశీల బకాయి చెల్లించలేదని ఆస్తి జప్తు

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపల్ మార్కెట్ ఆశీల బకాయి చెల్లించలేదని పాటదారుని ఆస్తి జప్తు చేశారు. గొల్లపల్లి గ్రామానికి చెందిన సావు మాణిక్యం ఆశీల పాటను రూ.12.60లక్షలకు పాడగా రూ.7.20లక్షలు మాత్రమే మున్సిపాలిటీకు జమ చేశారు. బకాయి మొత్తం చెల్లించాలని నోటీసులు జారీ చేసినప్పటికీ చెల్లించలేదు. రెండు నోటిసులకు స్పందించకపోవడంతో జప్తు నోటీసు జారీ చేశారు. జప్తు నోటీసుకూ స్పందించకపోవడంతో పోలీసులు సహకారంతో మున్సిపల్ ఆర్‌ఓ ప్రసాద్, ఆర్‌ఐ సురేష్ సోమవారం ఆస్తి జప్తు చేశారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న బొగ్గులదిబ్బ పేదలు, సిపిఎం నాయకులు

న్యాయం చేయాలని దళితుల ధర్నా

నివాసం ఉండేందుకు హుదూద్ ఇళ్లు ఇస్తామని కమిషనర్ ప్రకటన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని బొగ్గుల దిబ్బులో 50ఏళ్లుగా నివాసముంటున్న పేదల ఇళ్లను తొలగించిన మున్సిపల్ అధికారులు వెంటనే పేదలకు ఇళ్లు కట్టి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్ సూర్యకుమారికి వినతి అందజేశారు. కలెక్టర్ స్పందించి ఇళ్లు లేని వారికి గుంకలాంలో ఇళ్లు మంజూరు చేయాలని, అంతవరకు వీరిలో ఇళ్లు లేని వారు నివాసం వుండేందుకు లంకాపట్నంలోని హుదూద్ ఇళ్లలో అవకాశం ఇవ్వాలని నగర పాలక సంస్థ కమిషనర్‌కు సూచించారు. అయితే సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకర్రావు స్పందిస్తూ ఇచ్చిన మాట ప్రకారం వెంటనే హుదూద్ ఇళ్లు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఇళ్లను తొలగించడం అన్యాయమని అన్నారు. వీరిలో 20 మందికి ఎక్కడా ఇళ్లు ఇవ్వలేదన్నారు. ద్వారపూడిలో ఇళ్లు ఇచ్చిన వారికి కట్టుకునే స్థోమత లేదని,కావున రోడ్డున పడ్డ దళితులకు న్యాయం జరిగే వరకూ పోరాడుతామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బి.రమణ, ఆర్.ఆనంద్, అప్పలకొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

అపరాలు కొనుగోలుకు అనుమతి

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో రబీ లో మినుములు , పెసలు పండించిన రైతుల నుంచి ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు అనుమతులు వచ్చినట్లు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. మినుములు క్వింటా రూ.6600, పెసలు రూ.7755కు కొనుగోలు చేయనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మినుములు , పెసలు పండించిన రైతులు రైతు భరోసా కేంద్రాల ద్వారా పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ-క్రాప్‌లో నమోదై ఉండి సిఎం యాప్‌లో నమోదు చేయించుకున్న వారి నుండి మాత్రమే కొనుగోలు చేస్తామని తెలిపారు. కొనుగోలు కింద్రాలను ఆర్‌బికెల్లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఖజానా శాఖాధికారి గణేష్‌కు నివాళి

ప్రజాశక్తి-విజయనగరం

విజయనగరం ఖజానా శాఖాధికారి ఎస్ఆర్‌కె గణేష్ మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది సంతాపం ప్రకటించారు. స్థానిక ఖజానా శాఖ కార్యాలయంలో సోమవారం గణేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో ఖజానా శాఖ డిడి ఆర్ఎ సమర్పణ కుమార్, ఎటిఒలు నితిన్ జోషి, ఆదిత్య సింగ్, ఇతర అధికారులు, సిబ్బంది పద్మనాభం, ఆదినారాయణ, రామరాజు, సుధాకర్ తదితరులు ఉన్నారు.

మిగులు సిమెంట్ సర్దుబాటు చేయండి

నాడు-నేడు పనులపై సమీక్షలో కలెక్టర్ సూర్యకుమారి

ప్రజాశక్తి-విజయనగరం

మనబడి నాడు-నేడు పథకంలో భాగంగా జిల్లాలోని విద్యా సంస్థల్లో చేపట్టిన పనులకు సంబంధించి మిగులు సిమెంటును అవసరం ఉన్నచోట సర్దుబాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఎ. సూర్యకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. రెండోదశలో భాగంగా కేటాయించిన సిమెంట్‌ను కొన్ని చోట్ల పూర్తిగా వినియోగించలేదని, సంబంధిత నిల్వలను అవసరం ఉన్న ఇతర ప్రాంతాలకు బదిలీ చేయాలని సూచించారు. జిల్లాలో చేపట్టిన నాడు-నేడు పనుల ప్రగతిపై కలెక్టరేట్ ఆడిటోరియంలో సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. పనుల నిమిత్తం కేటాయించిన సిమెంటును వినియోగించి సకాలంలో పనులు పూర్తి చేయాలని, ఒకవేళ సిమెంటు మిగిలితే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సిమెంటు కేటాయించినప్పటికీ పనులు ప్రారంభం కాకపోతే సంబంధిత ఇండెంటును ఇతర ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. మొదటి ప్రాధాన్యతగా పాఠశాలలకు, రెండో ప్రాధాన్యతలో భాగంగా కళాశాలలకు మిగులు సిమెంటును సర్దుబాటు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

మధ్యాహ్న భోజనం మరింత రుచికరంగా వండాలి

మధ్యాహ్న భోజనం పథకంలో భాగంగా అందిస్తున్న ఆహారాన్ని మరింత రుచికరంగా వండాలని, ఎక్కువ మంది పిల్లలు ఆహారాన్ని తీసుకొనేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. పిల్లలు సరిగ్గా తినకపోవటం వల్ల రక్తహీనత, ఇతర సమస్యలు ఉత్పన్నమవుతాయని అన్నారు. బయట చిల్లర తిండి తినటం వల్ల పిల్లలు మధ్యాహ్న భోజనం తినడానికి ఆసక్తి కనబరచటం లేదని, దీన్ని దష్టిలో పెట్టుకొని పిల్లలను మధ్యాహ్నం పూట బయటకు పంపింపచకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఒక వేళ ఎవరైనా ఇంటి నుంచి బాక్సు తెచ్చుకుంటే అనుమతించాలని స్పష్టం చేశారు. సమావేశంలో డిఇఒ లింగేశ్వర రెడ్డి, డివిఇఒ సురేశ్, స్పెషల్ ఆఫీసర్లు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

ఆహార ఉత్పత్తుల మార్కెటింగ్‌కు ప్రోత్సాహం

వ్యవసాయ రంగంలో వినూత్నంగా ఆలోచించి పంటలు సాగు చేసే రైతులకు తగిన ప్రోత్సాహం అందించాలని అధికారులను కలెక్టర్ ఎ. సూర్యకుమారి ఆదేశించారు. చిరుధాన్యాల సాగు.. వాటి ప్రయోజనాలు, లాభాలు మార్కెటింగ్ పరిస్థితులు తదితర అంశాలపై ఔత్సాహికులకు అవగాహన కల్పించాలని సూచించారు. వివిధ విభాగాల అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఆహార ఉత్పత్తులకు సరైన మార్కెటింగ్ కల్పించటంతో పాటు, వాటిని ఆకర్షణీయంగా పేకింగ్ చేసి ఇతర ప్రాంతాలకు తరలించాలని పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాలు, రైతు సంఘాల ద్వారా ఔత్సాహికులను గుర్తించి తగిన ప్రోత్సాహం అందించాలని సూచించారు. వ్యవసాయ ఆధారిత మార్కెటింగ్, పశు సంపద వద్ధి ద్వారా ఆర్థిక ప్రయోజనాలు పొందేలా రైతులను ప్రోత్సహించాలని, వారికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో వ్యవసాయ, ఉద్యాన వన శాఖ అధికారులు, స్కిల్ డెవలప్‌మెంటు అధికారులు, డిఆర్‌డిఎ ఎపిఎంలు, ఇతర విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నందిగాం ప్రాంతంలో పరిశీలిస్తున్న సైంటిస్ట్ మురళీధర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ

విమానాశ్రయ నీటి వనరుల కోసం పరిశీలన

నేషనల్ జియోగ్రాఫికల్ రీసెర్చ్ శాస్త్రవేత్త సందర్శన

ప్రజాశక్తి - భోగాపురం

భోగాపురంలో త్వరలో నిర్మించబోయే అంతర్జాతీయ విమానాశ్రయానికి నీటి సరఫరా కోసం ప్రతిపాదనలు పంపినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులు తెలిపారు. నీటి వనరులను పరిశీలించేందుకు నేషనల్ జియోగ్రాఫికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ సైంటిస్ట్ డి. మురళీధరన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ ఉమాశంకర్ ప్రతిపాదిత ప్రాంతంలో సోమవారం పర్యటించారు. భోగాపురం మండలం నందిగాం, పూసపాటిరేగ మండలం కొప్పెర్ల, కొత్త నడిపల్లి ప్రాంతాలను పరిశీలించారు. ఎయిర్‌పోర్టుకు కావలసిన నీటి లభ్యత అంశాలపై చర్చించారు నదులు, చెరువుల నుంచి సముద్రంలో కలసిన నీరు మళ్లీ తిరిగి వెనక్కి రావడంతో పరిసర ప్రాంతాలు ఉప్పునీరుగా మారడంతో తీరంఒడ్డున రక్షణ గోడ నిర్మాణం కోసం పరిశీలించారు. రక్షణ గోడ నిర్మిస్తే విమానాశ్రయానికి నీరు మరల్చే ప్రక్రియ చేపట్టవచ్చని అన్నారు. ఉన్న అవకాశాలను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. సముద్రపు నీటిని డి శానిటైజేషన్ చేసేందుకు సాధ్యాసాధ్యాలపై అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఇఇ ఎవిఎస్ రాజన్, జెఇ హేమంత్ కుమార్, ఎఇఇ మహమ్మద్ పాషా, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

సమాజ హితం మహిళల చేతుల్లోనే

జెఎన్‌టియు వైస్ ఛాన్సలర్ వెంకట సుబ్బయ్య

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమాజ హితం మహిళల చేతుల్లోనే ఉందని జెఎన్‌టియుజి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వెంకట సుబ్బయ్య అన్నారు. జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సోమవారం యూనివర్శిటీలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ అండ్ గ్రీవెన్సు సెల్ , డైరెక్టరేట్ అఫ్ ఎంపవర్‌మెంట్ అఫ్ ఉమెన్ అండ్ గ్రీవిన్స్ సెల్ ఆధ్వర్యంలో 'సైబర్ ఇంటలిజెన్స్ అండ్ సెక్యూరిటీ' అనే అంశం కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె. వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ, మహిళ లేనిదే సమాజం లేదని, ప్రతి మహిళా కు సెల్యూట్ చేయాలని అన్నారు. ఈ కాలంలో మహిళలు అన్ని రంగాలలో బాగా రాణిస్తున్నారన్నారు. మహిళా తలచుకుంటే ఏదైనా సాధించగలరన్నారు. పిల్లల భవిష్యత్తును తీర్చి దిద్దే అవకాశం ఎక్కువగా మహిళకే ఉంటుందన్నారు. మహిళల కోసం ఉన్న చట్టాలను అందరు అవగాహన పెంచుకోవాలన్నారు. సైబర్ మోసాల పట్ల మహిళలు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రతీ ఒక్కరు సమాజం కోసం పాటు పడాలన్నారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. స్వామి నాయుడు మాట్లాడుతూ, సైబర్ సెక్యూరిటీ అనేది చాల అడ్వాన్స్ టెక్నాలజీ అని, ఈ రంగంలో నిపుణులకు మంచి ఉద్యోగ అవకాశాలు ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ అండ్ గ్రీవెన్సు సెల్ కన్వీనర్ ప్రొఫెసర్ జి.జయసుమ, ప్రొఫెసర్ డి. రాజ్యలక్ష్మి మాట్లాడుతూ సాంకేతికంగా ఏ రకంగా అభివృద్ధి చెందాలో ప్రతీ ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు.

ప్రసంగిస్తున్న జెఎన్‌టియుజి వైస్‌ఛాన్సలర్ వెంకట సుబ్బయ్య

గౌరవ వందనం స్వీకరిస్తున్న డిఐజి హరికృష్ణ

నెల్లిమర్ల పోలీసు స్టేషన్ తనిఖీ

ప్రజాశక్తి- నెల్లిమర్ల

వార్షిక తనిఖీల్లో భాగంగా విశాఖపట్నం రేంజ్ డిఐజి ఎస్.హరికృష్ణ సోమవారం సాయంత్రం నెల్లిమర్ల పోలీసు స్టేషను సందర్శించి, వివిధ స్టేషను రికార్డులు, సిడి ఫైల్స్‌ను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. పెండింగు కేసుల్లో దర్యాప్తును వేగవంతంగా చెయ్యాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీల్లో ఆయన వెంట విజయనగరం ఇన్‌ఛార్జ్ డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, భోగాపురం సిఐ విజయనాథ్, నెల్లిమర్ల ఎస్ఐ పి.నారాయణరావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇపిఎఫ్ పెన్షన్ రూ.9 వేలివ్వాలి

పిఎఫ్ కార్యాలయం ఎదుట పెన్షనర్ల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇపిఎఫ్ పెన్షన్ రూ.9వేలకు పెంచాలని, ఉచిత వైద్యం అందించాలని సోమవారం పిఎఫ్ కార్యాలయం వద్ద పింఛనుదార్లు ధర్నా చేశారు. ఈ సందర్భంగా పింఛన్లదార్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. నాగభూషణం డిమాండ్ మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షనర్లను చిన్న చూపు చూస్తున్నాయని అన్నారు. పెరిగిన ధరలతో పోల్చుకుంటే ప్రభుత్వం ఇచ్చే పెన్షన్ ఎటూ చాలడం లేదన్నారు. కేవలం పెన్షన్ మీద ఆధారపడి బతికేవారు ఆర్థిక పరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇల్లు గడవడానికి నానా కష్టాలు పడుతున్నారని అన్నారు. ఈ వయసులో బిపి, షుగర్లతో కాలం గడుపుతున్నారని అన్నారు. ఏమైనా పెద్దపెద్ద అనారోగ్య సమస్యలు వస్తే తట్టుకోలేక ఆర్థికంగా అప్పుల పాలౌతున్నారని ఆవేదన చెందారు. కావున ప్రభుత్వం ఉచిత వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం పిఎఫ్ కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు శేషగిరి, నాయకులు జామి రామారావు తదితరులు పాల్గొన్నారు.

పిఎఫ్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పింఛనుదార్లు

పాఠశాల పర్యవేక్షణ

నెల్లిమర్ల : స్థానిక డైట్ విద్యార్థులు పాఠశాల పర్యవేక్షణలో భాగంగా సోమవారం మండలంలోని 14 ప్రాథమిక ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులను పర్యవేక్షించారు. నెల్లిమర్ల ఆదిత్యా విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థుల, అభ్యాసన సామర్థ్యాలను, యాటిట్యూడ్‌ను పర్యవేక్షించారు. పాఠశాలలో టైం టేబుల్, ఏ రికార్డులను నిర్వహిస్తున్నారో నమోదు చేసుకున్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వి. అమృత, కరస్పాండెంట్ వి. సూరిబాబు, డైట్ విద్యార్థులు పాల్గొన్నారు.

హక్కులను వినియోగించుకోవాలి

గరివిడి : భారత రాజ్యాంగం మహిళలకు ఎన్నో హక్కులు కల్పించిందని ఇవి మానవ హక్కులలో భాగమేనని మానవ హక్కుల ఫౌండేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు భోగాపురం శ్రీదేవి అన్నారు. సోమవారం గరివిడిలో గ్రామైక్య సంఘాల సహాయకులతో 'మానవ హక్కుల పరిరక్షణలో మహిళ పాత్ర' అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు వారుకున్న హక్కులను వినియోగించుకోవాలన్నారు. సమావేశంలో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ రీజియన్ అధ్యక్షుడు మానాపురం హరీష్ కుమార్, జిల్లా అధ్యక్షుడు వై రామ్మోహన్ రావు, ఉపాధ్యక్షులు పోలీసు, చీపురుపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు బోర సూర్యనారాయణ, వెలుగు ఎపిఎంలు ఎల్.పద్మ, విజయ, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ కళాశాలలకు ధీటుగా..

శృంగవరపుకోట: ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలకు ధీటుగా ఎస్‌కోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సకల సౌకర్యాలు ఉన్నాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు అన్నారు. ఆయన ఆధ్వర్యంలో సోమవారం డిగ్రీ కళాశాల అడ్మిషన్ క్యాంపైనింగ్ సోమవారం ప్రారంభించారు. ఇందులో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లి డిగ్రీ అడ్మిషన్లపై విద్యార్థులకు వివరించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్నటువంటి ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్, డిజిటల్ క్లాసెస్, వర్చువల్ క్లాసెస్, మోడ్రన్ జిమ్, డిజిటల్ లైబ్రరీ, జెకెసి మొదలగు వసతులన్నీ తమ కళాశాలలో అందుబాటులో ఉన్నాయని విద్యార్థులు అందరూ కూడా ఈ సౌకర్యాలను ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జి. ఈరన్న, చల్లా శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ వలి ఖాన్, జూనియర్ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ నాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

గజపతినగరంలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు

గజపతినగరం : స్థానిక ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలోని పిల్లలకు, సచివాలయంలో సిబ్బందికి, వృద్ధులకు మరుపల్లి మరుపల్లి పిహెచ్‌సి వైద్యాధికారి ఎం. సాయి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజిషియన్ సేవలను సోమవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 65 మందికి ఆరోగ్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కర్రి రామునాయుడు, ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, ఆశ కార్యకర్తలు,104 సిబ్బంది పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న టిడిపి నాయకులు

జగనాసుర రక్తచరిత్ర పుస్తకావిష్కరణ

నెల్లిమర్ల : వివేకానంద రెడ్డి హత్యకు సంబంధించిన జగనాసుర రక్త చరిత్ర పుస్తకాన్ని టిడిపి నెల్లిమర్ల నియోజకవర్గం ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు ఆధ్వర్యంలో సోమవారం విజయనగరంలోని ప్రదీప్ నగర్‌లో టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు కిమిడి కళా వెంకట్రావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సువ్వాడ రవి శేఖర్, కంది చంద్రశేఖర్, సువ్వాడ వనజాక్షి, కడగల ఆనంద్ కుమార్, ఆకిరి ప్రసాదరావు, కర్రోతు సత్యనారాయణ, లెంక అప్పలనాయుడు, నెల్లిమర్ల కౌన్సిలర్స్ అవనాపు సత్యనారాయణ పాల్గొన్నారు.

మహిళలకు చీరలు పంపిణీ

బొబ్బిలి : భారత దేశానికి విధి నిర్వహణలో భాగంగా ఫిబ్రవరి 13న మదర్ థెరిసా వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకొని సోమవారం మదర్ థెరిసా ట్రస్ట్ ఆర్గనైజర్ క్లైవ్ కూపర్ ఆధ్వర్యంలో 15 మంది పేదలకు చీరలు పంపిణీ చేశారు. ప్రముఖ వైద్య సేవకులు తప్పిట సత్యనారాయణ సారథ్యంలో ఇందిరమ్మ కాలనీలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రములో జిల్లా బిఎస్‌సి ఇన్‌ఛార్జి సోరు సాంబయ్య, ఉత్తరాంధ్ర అభివృద్ధి సాధన సమితి కన్వీనర్ కనక మహేష్ పట్నాయక్, బ్రదర్ సైమన్, సింగారపు గోపి తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం సందర్శన

భోగాపురం : ఎయిర్ పోర్టు నిర్వాసిత ఆర్అండ్ఆర్ కాలనీలో సోమవారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని జిల్లా వైద్య శాఖాధికారి రమణికుమారి సందర్శించారు. వారం రోజులు పాటు వైద్య శిబిరాన్ని కొన సాగించాలని పోలిపల్లి పిహెచ్‌సి వైద్యాధికారి తిరుపతి స్వామిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.50వేలు విరాళం

కొత్తవలస : కొత్తవలస మేజర్ పంచాయతీ పరిధిలోని డ్రైవర్స్ కాలనీలో కొలువైన లక్ష్మీ గణపతి ఆలయ అభివృద్ధికి కొత్తవలస మాజీ సర్పంచ్ మామిడి సరయ్య శెట్టి రూ.50వేల నగదును విరాళంగా అందజేశారు. సోమవారం స్వామి వారిని దర్శించి, కమిటీ సభ్యులకు నగదును అందజేశారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందజేస్తానని తెలిపారు. నగదును ఆలయ అభివృద్ధి పనులకు వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

తైక్వాండోలో జిల్లాకు పతకాల పంట

విజయనగరం : ఈ నెల 12న కాకినాడలో జరిగిన 38వ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ తైక్వాండో పోటీల్లో విజయనగరం క్రీడాకారులు 11 మెడల్స్ సాధించారు. ఇందులో ఒక గోల్డ్ మెడల్, నాలుగు సిల్వర్ మెడల్స్, ఆరు బ్రాంజ్ మెడల్స్ ఉన్నాయి. ఓవరాల్ ఛాంపియన్షిప్‌లో మూడో స్థానం సాధించారు. వీరిని జిల్లా తైక్వాండో అధ్యక్ష కార్యదర్శులు గురాన అయ్యలు, సిహెచ్ వేణుగోపాలరావు సోమవారం అభినందించారు.

తల్లి మృతదేహంతో ఆస్పత్రి వద్ద నిరసన తెలుపుతున్న కుమార్తె

మా అమ్మమ్మ చావుకు వైద్యులే కారణం

మృతదేహంతో ఆస్పత్రి వద్ద నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా కేంద్రాసుపత్రి వైద్యులు నిర్లక్ష్యం కారణంగా తమ అమ్మమ్మ మరణించిందని, అందుకు కారణమైన వైద్యులపై చర్య తీసుకోవాలని వెలగాడ వంశీ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్ర ఆసుపత్రి అవతనంలో అమ్మమ్మ మృత దేహంతో నిరసన తెలిపారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ జొన్నవలస ఎస్‌సి కాలనీకి చెందిన కోరాడ రాములమ్మ (73) అస్వస్థతకు గురవ్వడంతో కుటుంబ సభ్యులు ఎస్.కోట సిహెచ్‌సికి తరలించారు. యూరినల్ కాకపోవడంతో అక్కడ యూరినల్ బ్యాగ్ అమర్చారు. మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించాలని వైద్యులు చెప్పారు. దాంతో ఆదివారం కేంద్రాసుపత్రికి తీసుకొచ్చారు. ఆమె సమస్యను వైద్యునికి చెప్పగా ఆ వైద్యుడు తమపై దురుసుగా ప్రవర్తించడమే కాకుండా యూరిన్ పాస్ చేయించే ఎక్యూప్‌మెంట్ ఈ ఆసుపత్రిలో లేదని, ఆ ఎక్యూప్‌మెంట్ రావడానికి ఐదేళ్లు పడుతుందని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పి వైద్యం చేయడంలో జాప్యం చేశారు. ఈనేపథ్యంలో సోమవారం రాములమ్మ మృతి చెందింది. పేదల ప్రాణాలంటే లెక్కలేని ఇటువంటి వైద్యులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని వంశీకృష్ణ డిమాండ్ చేశారు. వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశామని, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పోటీలను ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్ ఆనంద్ ; విల్లు ఎక్కుపెట్టిన క్రీడాకారిణి

ఆర్చరీ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

పార్వతీపురం జూనియర్ కళాశాల ప్రాంగణంలో 66వ రాష్ట్ర స్థాయి ఆర్చరీ ఛాంపియన్‌షిప్ పోటీలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అండర్-14, 17 బాలబాలికల విభాగాల్లో నిర్వహించే ఈ విలువిద్య క్రీడా పోటీలను జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్, ఎస్పి వి.విద్యాసాగర్ నాయుడు జ్యోతి ప్రజ్వలన, జాతీయ జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. పోటీలు మూడు రోజులపాటు జరగనున్నాయి. బాలురు 250 మంది, బాలికలు 250 మంది, 15 మంది సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు. ఈ విలువిద్యా పోటీలు రిజర్వు, కాంపౌండ్, ఇండియన్ రౌండ్స్ విభాగాల్లో నిర్వహిస్తున్నారు. జాయింట్ కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ క్రీడాకారులు ఆత్మ స్థైర్యంతో, పట్టుదలతో, ఏకాగ్రతతో ఆడాలని, అప్పుడు గెలుపు, పతకాలు సిద్ధిస్తాయని చెప్పారు. ప్రతి ఒక్క అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని క్రీడాకారులకు ఆయన సూచించారు. ఎస్పి విద్యాసాగర్ నాయుడు మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తి అలవర్చుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. జిల్లా క్రీడల చీఫ్ కోచ్ ఎస్.వెంకటేశ్వర రావు, డిఇఒ ఎస్.డి.వి.రమణ, ఆర్చరీ సెక్రటరీ డి.గాంధీ, ప్రతినిధులు జి.భానుమూర్తి, ఎం.మనోహర్ పాల్గొన్నారు.

కర్రోతు బంగార్రాజును అభినందిస్తున్న గరికిపేట టిడిపి నాయకులు

పార్టీ బలోపేతానికి కృషి : కర్రోతు

నెల్లిమర్ల : గ్రామాల్లో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టిడిపి నెల్లిమర్ల నియోజకవర్గం ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. సోమవారం నెల్లిమర్ల మండలం గరికపేట గ్రామానికి చెందిన నాయకులు పోలిపల్లిలో ఆయన స్వగృహంలో కర్రోతును కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమన మాట్లాడుతూ నెల్లిమర్లలో టిడిపి పట్టుందని, మరింత బలోపేతం చేయడానికి కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గరికపేట మాజీ సర్పంచ్ చింతపల్లి సత్యనారాయణ, బెల్లాన అచ్చెన్నాయుడు, బెల్లాన చిన్నప్పడు, మహంతి శ్రీనివాసరావు, నాగభూషణరావు, బెల్లాన ఈశ్వరరావు, బంగారునాయుడు, ఆదినారాయణ, త్రినాద్, పతివాడ రమణ తదితరులు పాల్గొన్నారు.

16న జాబ్ మేళా

బొబ్బిలి : రాజా ఆర్.ఎస్.ఆర్.కె రంగారావు కళాశాలలో ఈ నెల 16న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సిహెచ్ వీరేంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎం.ఎస్.ఎన్ లాబొరేటరీస్ ఫార్మా కంపెనీ యాజమాన్యం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 2020, 2021, 2022 సంవత్సరాల్లో బిఏ, బిఎస్సి, బికాం ఉత్తీర్ణత సాధించిన పురుష అభ్యర్థులు అర్హులన్నారు.

స్పందనకు 110 వినతులు

ప్రజాశక్తి- విజయనగరం

జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెపుదాం (స్పందన) కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించి 110 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ విభాగానికి సంబంధించి అత్యధికంగా 82 ఉన్నాయి. పింఛన్లు, రేషన్‌కార్డులు, ఉపాధి బిల్లులు తదితర సమస్యలపై వినతులు అందాయి.కలెక్టర్ ఎ. సూర్యకుమారి, జె.సి మయూర్ అశోక్, డిఆర్‌ఒ గణపతి రావు, ప్రత్యేక ఉప కలెక్టర్లు పద్మావతి, సూర్యనారాయణ, దొర పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ. స్పందన లో అందిన వినతులు పెండింగ్ పెట్టకుండా గడువు లోగా పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు.

పోలీసుశాఖ ఆధ్వర్యాన...

జిల్లా పోలీసు కార్యాలయంలో విజయనగరం ఇన్ ఛార్జి డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు ఆధ్వర్యాన వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు బాధితులు తమ సమస్యలను డిఎస్‌పికి వివరించారు. వెంటనే ఆయన సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో సిఐలు జె.మురళి, రుద్రశేఖర్, ఎస్ఐలు వాసుదేవ్, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న డిఎస్‌పి శ్రీనివాసరావు

చట్టాల గురించి తెలుసుకోవాలి

ప్రజాశక్తి- డెంకాడ

ప్రతి ఒక్కరూ చట్టాల గురించి తెలుసుకోవాలని, చట్టాల గురించి తెలుసుకుంటే, కష్టాలు పడవలసిన అవసరం ఉండదని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బిహెచ్‌వి లక్ష్మీ కుమారి అన్నారు. జోన్నాడలో సోమవారం జిల్లాన్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలకు ఉచిత న్యాయ సేవను అందిస్తున్నామన్నారు. ఏటా మూడు నెలలకు ఒకసారి జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఈ అదాలత్‌లో రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించడం జరుగుతుందన్నారు. ప్రామిసరీ నోట్, భూ తగాదాలు, భార్య భర్తల మధ్య తగాదా చట్టాల గురించి వివరించారు. ఎస్ఐ యు. మహేష్ మాట్లాడుతూ యువత సెల్ ఫోన్, ఇంటర్ నెట్ మోజులో పడి వారి జీవితాలను పాడుచేసుకుంటున్నారన్నారు. లైసెన్స్ లేకుండా మోటార్ సైకిల్‌ను నడిపి వారి ప్రాణాలతో పాటుగా ఇతరుల ప్రాణాలకు నష్టం కలిగిస్తున్నారన్నారు. మైనర్ బండి నడిపి ప్రమాదం జరిగితే తల్లిదండ్రుల ఆస్తుల నుండి నష్ట పరిహారం బాధిత కుటుంబాలకు అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఎన్. అప్పల నాయుడు, సీనియర్ న్యాయవాదులు ఎం. జివిఎస్ఎన్ తాడిరాజు, తారీ గొప్పుల రవి, సర్పంచ్ కోరాడ రమణి అధిక సంఖ్యలో ప్రజలు, కోర్టు సిబ్బంది, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జడ్జి లక్ష్మికుమారి

పోస్టర్లు ఆవిష్కరణ

విజయనగరం : బ్యాంకు వినియోగదారులను అప్రమత్తం చేయడానికి రిజర్వ్ బ్యాంకు అఫ్ ఇండియా పలు సూచనలు చేసింది. ఇందుకు సంబంధించి ప్రజల్లో అవగాహన పెంచడానికి పోస్టర్లను ముద్రించింది. సరైన ఆర్థిక వ్యవహారమే మిమ్మల్ని కాపాడుతుంది అనే నినాదంతో ముద్రించిన ఈ పోస్టర్లను స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సూర్య కుమారి. ఎల్‌డిఎం శ్రీనివాసరావు, బ్యాంకు ఉన్నతాధికారులు ఆవిష్కరించారు. ఇప్పుడు పొదుపు చేయండి, భవిష్యతును సురక్షితం చేసుకోండి, పొదుపు చేసే అలవాటే మిమ్మల్ని ఆర్థిక ఇబ్బందుల నుండి కాపాడగలదు అనే విషయాన్నీ ప్రజలు గమనించాలని ముద్రించారు. ఒటిపి, పాస్ వర్డ్, పిన్ లేదా బ్యాంకు ఖాతా వివరాలను ఇతర వ్యక్తిగత వివరాలను ఎవ్వరితో నూ పంచుకోకూడదని ఎల్‌డి ఎం తెలిపారు. కష్టబడి సంపాదించిన డబ్బు విలువైనదని, తెలివిగా ఖర్చు చేయాలనీ, ముందుగా బడ్జెట్ చేయు, తర్వాత ఖర్చు చేయు అనే అంశాల ను పోస్టర్‌లో పొందుపర్చినట్లు తెలిపారు

సచివాలయ సందర్శన

వేపాడ : మండలంలోని సోంపురం గ్రామ సచివాలయాన్ని ఎంపిడిఒ బిఎస్‌కెఎం పట్నాయక్ సోమవారం పరిశీలించారు. ఈ పరిశీలనలో భాగంగా గ్రామ పంచాయతీకి సంబంధించిన రికార్డుతో పాటు సిబ్బంది రోజువారి నిర్వహిస్తున్న విధులకు సంబంధించిన రికార్డులను కూడా పరిశీలించారు. ప్రధానంగా ఇంటి పన్ను వసూలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్‌డబ్ల్యూ పిసి షెడ్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

ప్రజాశక్తి - గుర్ల

బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని బాల్య వివాహాల వల్ల డిగ్రీ పట్టాలు అందుకోవాల్సిన వయసులో బాలలు పిల్లల్ని మోస్తున్నారని సామాజిక, పరివర్తన మార్పు సమాచార వ్యవస్థ జిల్లా సమన్వయ అధికారి బి.రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం గుర్ల జెడ్‌పి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, రక్తహీనతకు కారణాలు, పౌష్టికాహారం, జంక్ ఫుడ్ వల్ల కలిగే ప్రమాదాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల మాతా, శిశుమరణాలు ఎక్కువగా సంభవిస్తాయన్నారు. ప్రపంచంలోనే అత్యధికంగా బాల్య వివాహాలు జరుగుతున్న దేశాలలో భారత్ మూడో స్థానంలో ఉందన్నారు. మన రాష్ట్రంలో వీటి వల్ల సమాజంలో అమ్మాయిలు సామాజికంగా, ఆర్థికంగా ఎక్కువగా నష్టపోతున్నారన్నారు. బాల్య వివాహాల వల్ల రాష్ట్రంలో 59 శాతం మంది గర్భిణులు ప్రసవ సమయంలో రక్తహీనతతో మరణిస్తున్నారన్నారు. మరణాలు జరగకుండా అడ్డుకట్ట వేయాలంటే బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. సాధారణంగా ప్రతి ఒకరికి హిమోగ్లోబిన్ 12-15 శాతం ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పి.ఉమామహేష్, ఉపాధ్యాయులు ఎ.శ్రీనివాసరావు, ఆర్.రామారావు, ఎం.కృష్ణ, ఎఎన్ఎం సంతోషి, మహిళా సంరక్షణ కార్యదర్శి సునీత పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న రామకృష్ణ

నిర్లక్ష్యం వహిస్తే మెమోలు

ప్రజాశక్తి- బొబ్బిలి

జగనన్న ఇళ్ల నిర్మాణాల్లో నిర్లక్ష్యం వహిస్తే ఛార్జ్ మెమోలు జారీ చేస్తామని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు హెచ్చరించారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం జగనన్న ఇళ్ల నిర్మాణంపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడ్కో, ఐటిఐ కాలనీ లేఅవుట్లలో జగనన్న ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలన్నారు. బ్రిక్ వర్క్ ప్రారంభమయ్యేలా చూడాలని కోరారు. ఈనెల 20 నాటికి 70 శాతం ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. సమావేశంలో సచివాలయ, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

సూచనలు చేస్తున్న కమిషనర్ శ్రీనివాసరావు

అక్రమ వసూళ్లపై డిసికి ఫిర్యాదు

ప్రజాశక్తి - జామి

జామి యల్లారమ్మ జాతర పేరిట అక్రమ వసూళ్లపై దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్‌కు మాజీ జెడ్‌పిటిసి బండారు పెద్దబాబు సోమవారం ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన డిసి, విచారణ చేపట్టాలని విజయనగరం అసిస్టెంట్ కమిషనర్‌కు ఆదేశించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకర్లతో పెద్దబాబు మాట్లాడుతూ దౌర్జన్యంగా వసూలు చేసిన చందాలను తిరిగి ఇప్పించాలని ఎసికి డిసి ఆదేశించినట్లు తెలిపారు. పండుగలో ఫ్రీపాస్ లేకుండా అకౌంట్ అప్ప చెప్పాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. ఉత్తరాంధ్ర ఇలవేల్పుగా ప్రసిద్ధిగాంచిన యల్లారమ్మ జాతర పేరిట లక్షలాది రూపాయలు అక్రమ వసూళ్లకు పాల్పడున్నారని, తక్షణమే ఉత్సవ కమిటీ పేరిట చేస్తున్న వసూళ్ల పై సమగ్ర విచారణ జరిపి, వసూళ్ల వెనక్కి ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశానని ఆయన తెలిపారు. తాజాగా విశాఖ దేవాదాయశాఖ డిప్యూటీ కమీషనర్‌ను కలిసి, అక్రమ వసూళ్ల దందాను వివరించారు. దీనిపై స్పందించిన డిసి విచారణకు ఆదేశించినట్లు పెద్ద బాబు తెలిపారు.

ఫిర్యాదు చేస్తున్న మాజీ జెడ్‌పిటిసి పెద్దబాబు

లోకేష్ పాదయాత్రతో వైసిపిలో భయం

ప్రజాశక్తి - శృంగవరపుకోట

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్రలో వైసిపిలో భయం పట్టుకుందరని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. యువగళం పేరుతో లోకేష్ మొదలుపెట్టిన పాదయాత్ర 16వ రోజు 201 కిలోమీటర్లు దూరం పూర్తిచేసిన సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు జి.ఎస్.నాయుడు ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీనివాస కాలనీ కుసుమ హరినాథ్ మందిరంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువగళం పేరుతో తలపట్టిన పాదయాత్ర ఇంకా 383 రోజులు పాటు 3,780 కిలోమీటర్ల సుదీర్ఘంగా ఉన్నప్పటికీ వైసిపి నాయకుల్లో అప్పుడే ఎన్నికల ఓటమి భయం పట్టుకుందన్నారు. ఈ విధంగా లోకేష్ ప్రతి అడుగు ప్రజాగళమై చేస్తున్న పాదయాత్రలో ఎటువంటి ఆటంకాలు లేకుండా నిర్విరామంగా జరగాలని, కోరుకుంటూ యువగళం జై, లోకేష్ బాబు జై అంటూ నినాదాలు చేస్తూ ఒకరికొకరు మిఠాయిలు, స్వీట్లు తినిపించుకున్నారు. అనంతరం 3,4,5వ వార్డులలో నిర్వహించిన ఇదేం కర్మ మనరాష్ట్రానికి, రచ్చబండ కార్యక్రమాలలో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న, ఎస్.కోట గ్రామ కమిటీ అధ్యక్షులు కొనదం మల్లేశ్వరరావు, మాజీ ఎంపిటిసి గన్ను బంగారమ్మ, 4వ వార్డు మెంబెర్ పెదగాడ లక్ష్మి, 5వ వార్డు మెంబెర్ గూడుపు నాగమణి, నాయకులు కాపుగంటి శ్రీనివాసు, చెక్కా కిరణ్ కుమార్, అనకాపల్లి చెల్లయ్య, వాకాడ బాలు, సవరాల తాతారావు, పొట్నూరు అప్పలరాజు, మోపాడ చిన్ని కృష్ణ, బర్ల స్వామి నాయుడు, పెదగాడ రాజు, బ్రహ్మాజీ, బడిగంటి రవీంద్ర, శంకర్, గనివాడ బంగారు నాయుడు, పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

సిసి రోడ్డు నిర్మాణం

రోడ్డును పరిశీలిస్తున్న సర్పంచ్, అధికారి

వేపాడ : మండలంలోని వెంకటేశ్వర స్వామి ఆలయం వీధిలో సచివాలయం నిధులు రూ. 2లక్షలతో సిసి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. సర్పంచ్ మెలిపాక అర్జునమ్మ, నాయకులు రమణ పర్యవేక్షణలో సోమవారం ఈ పనులను చేపట్టారు. ఈ పనులను మండల పంచాయతీ శాఖ ఇంజనీరింగ్ అధికారి ఎండి ఆలీ పరిశీలించారు. ఆయన వెంట వర్క్ ఇన్‌స్పెక్టర్ కుమార్ ఉన్నారు.

జిల్లా ఖజానాశాఖాధికారి మృతి బాధాకరం

ప్రజాశక్తి- బొబ్బిలి

జిల్లా ఖజానాధికారి ఎస్.ఆర్.కె గణేష్ మృతి బాధాకరమని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు రౌతు రామమూర్తి అన్నారు. గణేష్ మృతికి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో సోమవారం సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ గణేష్ మృతి జిల్లా ఉద్యోగులు, రిటైర్డు ఉద్యోగులకు తీరని లోటన్నారు. నిష్పక్షపాతంగా పని చేసి సేవలు అందించే వారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు కర్రి సత్యనారాయణ, ఎల్.జగన్నాథం, తదితరులు పాల్గొన్నారు.

కోనేటిలో దిగి వ్యక్తి మృతి ?

ప్రజాశక్తి- విజయనగరం

పట్టణ శివారు ప్రాంతమైన అయ్యన్నపేట అయ్యన్న కోనేరులో వంగర మహంకాళి (30) సోమవారం మద్యం మత్తులో కోనేటిలో దిగి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం మద్యం సేవించి, పాలనగర్‌లో గల తన బావ దుకాణం వద్దకు వెళ్లి అనంతరం అక్కడ సమీపంలో గల అయ్యన్న కోనేరు వద్దకు చేరుకొని తన ఒంటిపై ఉండే బట్టలను, మద్యం బాటిల్ గట్టుపై ఉంచి కోనేటిలోకి దిగినట్లు కోనేటి వద్ద శివాలయం నిర్మాణం చేస్తున్న కార్మికులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఒకటవ పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అదృశ్యం కేసుగా నమోదు చేశారు. అయితే చీకటి పడడంతో నీటిలో గాలింపుకు అవకాశం లేనందున మహంకాళి కోనేటిలో మృతి చెందాడ లేదా అనేది ఇంకా నిర్ధారణ కావాల్సి ఉంది.

పొలాల్లో అగ్ని ప్రమాదం

వంగర : మండలంలోని చిన రాజులు గుమ్మడ పొలాలలో సోమవారం అగ్నిప్రమాదం జరిగింది. గుర్తు తెలియని వ్యక్తికి సిగరెట్ కాల్చి పారేయడంతో సుమారు ఆరు ఎకరాల విస్తీర్ణం కలిగిన నీలగిరి తోట, ఎనిమిది ఎకరాల సంబంధించిన గడ్డి కుప్పలు, కాలి బూడిదయ్యాయి. కొంతమేర జీడి తోట కూడా అగ్నికి ఆహుతైంది. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో రాజాం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక కేంద్రం ఎస్ఐ జనార్ధన రావు, సిబ్బంది మంటలను అదుపు చేసి నష్టం జరిగిన పంటలను పరిశీలించి పంట నష్టాన్ని అంచనా వేశారు.

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మహారాజశ్రీ రాజాం సీనియర్ సివిల్ జడ్జి కోర్టువారి దివ్యసముఖమునకు
H.M.O.P. 49/2022

బిట్వీన్ :
కాళ్ల ప్రకాష్‌రావు ......వాది
And:
కాళ్ల రాజేశ్వరి .....ప్రతివాది
కొండంపేట గ్రామం, రాజాం మండలం & నగర పంచాయతీ, విజయనగరం జిల్లా.

నోటీసు

పై నెంబరు అమలు పిటీషన్‌లో మీకు అనేకసార్లు పై కోర్టువారి నుండి నోటీసులు పంపినా మీరు తీసుకోనందున పై తెల్పిన అమలు మీకు నోటీసు నిమిత్తం **తే 27-02-2023దీ**కి వాయిదా అయిఉన్నది. కావున పై నెంబరు అమలు పిటీషన్‌లో మీకు ఏమైనా ఆక్షేపణలున్న ఎడల **తే 27-02-2023దీన ఉదయం10-30 గం॥**లకు మీరు స్వయంగా గాని, వకీలు ద్వారాగాని పై కోర్టులో హాజరై మనవి చేసుకోవలెను. లేనిచో పై అమలు మీ పరోక్షమందు కోర్టువారి అనుమతితో తీర్మానించబడును.

బి.కాశీ
వాది తరపు న్యాయవాది,
రాజాం

మహారాజశ్రీ జిల్లా అదనపు జడ్జివారి కోర్టు, విజయనగరం
IA No - 1079 of 2022 in OS 92/2016

శ్రీ ముదునూరు శ్రీనివాసవర్మ ....వాది
మరియు
శ్రీమతి కట్టమూరి రత్నావతి మరియు ఇతరులు ..... ప్రతివాదులు

To
శ్రీమతి అయినాల రమణకుమారి, W/o లేటు కూర్మయ్య, రవీంద్ర భారతి స్కూల్ ప్రక్కన, శృంగవరపుకోట గ్రామం & మండలం, విజయనగరం జిల్లా.

నోటీసు

ఇందుమూలంగా తెలియజేయునదేమనగా పైన తెలిపిన పిటిషన్ IA - 1079/22 లో మిమ్ములను శ్రీమతి కట్టమూరి రత్నావతి గారి వారసులుగా 9వ ప్రతివాదిగా చేర్చుటకు సదరు పిటిషన్ దాఖలు చేయడమైనది. సదరు పిటిషన్ **తేది 21-02-2023**కు వాయిదా కాబడియున్నందున సదరు తేదికి మీరు గాని, మీ యొక్క న్యాయవాది ద్వారా గాని **ఆ రోజు ఉ॥ 10-30 గం॥**లకు హాజరు కావలెను. లేనియెడల సదరు పిటిషన్‌పై శ్రీ కోర్టువారు నీ పరోక్షంన (ఎక్స్‌పార్టీ) విచారించి తీర్మానం చేయుదరని తెలియజేయడమైనది.
గౌరవ కోర్టువారి ఆదేశం మేరకు ఈ పత్రికా ప్రకటన జారీచేయడమైనది.

పి.వేణుగోపాలరావు
అడ్వకేట్ & నోటరీ,
బాలాజీనగర్, విజయనగరం